


# ప్రకృతి - ప్రణయజీవులు

రచన: కలివేలు

అది ఒకతోట.

ఆ తోటకొక అందంగూర్చు సరోవరము.

ఇక్కట్టులను తొలగించి మక్కువ గూర్చు కలువ కన్నియలు.

ఈ పూలపరిమళాలను తోటంతా వెదజల్లువాయువులు.

ఉల్లము నూపించే కోకిలగానము.

ఊరట కలిగించే ప్రకృతి అందము.

ఋ ౠ ఌ ౡ అని దూరాన అరుస్తున్న చిలుకల నవ్వడి.

ఎదనానందపరిచే శరద్రాత్రి వెన్నెల.

ఏకాకినై ఆ వెన్నెల వృధా పోతుందని దిక్కులుచూస్తూ నుంచున్నా నా తోటలో.

ఐక్యమై అలరారే ప్రణయజీవుల ఆదర్శ జీవితాన్ని కోకిల తనపాటల ద్వారా వినిపిస్తుంది.

ఒక్కటిగా ఓ చెట్టుపై కూర్చొని జంటలేని జీవితములోని నిస్సారపువిలువలను వివరించే చక్రవాకపక్షి రోదన ధ్వనికి సానుభూ, నా ఒంటరితనానికి దిగులూ కలుగుతున్నాయి.

ఓరగంటి చూపులను మబ్బుల చాటునుండి విసరుతున్న చందమామను చూసాను.

ఔనౌను! నా ప్రియురాలి ఓరగంటి చూపులను గుర్తుకుతెచ్చి, నన్ను వెక్కిరిస్తూ నాలోనున్న బాధను ద్విగుణీకృతం చేస్తున్నాడని చంద్రునిపై తీవ్రంగా కోపపడ్డాను.

అందములోని ఆనందాన్ని చందమామవైపు చూస్తూ సంతోషమయమైన కేరింతలద్వారా వాటి ఆనందాన్ని విపులీకరిస్తున్నాయి చకోరపక్షులు.

అః! మీ ఆనందమే ఆనందము! ఆ ఆనందానికి నేనింకా నోచుకోలేదని చకోరపక్షులకు చెపుతూ నామీద నేనే జాలిపడ్తున్నాను.

కమనీయమైన గానము దూరాన్నుండి వినిపించగా ఆశతో వెనుదిరిగి చూసాను.

ఖగములు కొన్ని ఆకాశములో ఎగురుతూ, అరుస్తూ ఆవెన్నెలలో మరలా తమగూళ్లకు చేరుకొంటున్నాయి.

గమనించిన నేను నిరాశతో క్రుంగిపోయాను.

ఘల్లుఘల్లుమనే గజ్జెలసవ్వడి, గలగలమనే గాజులశబ్దము విన్న నా హృదయము ఆనందముతో గంతులేసింది.

ఙ ఙ మని అంటుందెక్కడో ఓ పక్షి.

చకోరపక్షులవైపు గర్వంగా చూసి చంద్రుడు కలువకన్నెలను తనివితీరా చూసినట్లే నాకు చేరువౌతున్న నా ప్రియురాలి వంపుసొంపుల వయ్యారాలను చూస్తున్నాను.

ఛత్రమువలె ఆమె ముఖాన్నావరించిన అప్పుడే తలంటిపోసుకొన్న ఆమె ముంగురులు గాలిలో నాట్యమాడుతుంటే, తలపైనున్న మల్లెపూలు నాకేసి తొంగిచూసి నవ్వుతున్నాయి.

జవ్వనంతో సూర్య చంద్రుల కాంతినంతా తన వశముచేసుకొని వెలిగే ఆ సుందరాంగి నా ఆరాధ్యదేవతై నా పూజ లందుకొంటూ, ప్రణయ సామ్రాజ్యానికి రాణియై నన్ను పరిపాలిస్తూ నాజీవితానికి పూలబాటను నిర్మించిన ఆ నిర్మల హృదయ అందానికి నిలయమై, ఆనందానికి హేతువై నన్ను మరపించి మత్తులో ముంచేందుకు నాకు క్షణక్షణానికి దగ్గరవ్తుంది.

ఝల్లున ఉల్లము పొంగుతూ ఉద్రేకాన్ని రేకెత్తిస్తుంది.

ఞ, ఞ మని అంటుందెక్కడో ఓ పిట్ట.

టక్కులాడి! సరియైనవేళ కొస్తానని నాలో కొన్ని నిముషాలు విరహాన్ని రేకెత్తించి నన్ను మోసగించింది. స్త్రీలంతా యింతేనేమో? అన్న కోపముతో, ఇప్పటికి నామీద దయగలిగిందా అన్నదుఃఖముతో, ఇప్పటికైనా వచ్చిందికదా! అన్న సంతోషముతో ఆమెపై చిరుకోపము నటించినవానివలె నా ముఖాన్ని యిటువేపు త్రిప్పుకొని ఆ తోటలో ప్రకాశిస్తున్న పలురకాల పూలను చూస్తూ వుండిపోయాను.

ఠ పీమని తన మృదువైన హస్తాలతో నా వీపుపై కొట్టి తామరతూండ్లలావున్న తనచేతులనూ, మాలతి పూరేకుల్లావున్న తన వ్రేళ్లనూ నా కంఠానికి చుట్టగా నానరాలు చలించాయి.

డమ్మని నా తలను ఆమె నుదుటికి ఢీకొట్టి ఆమెను నాముందుకి లాక్కొనగా ఫకాలున నవ్విన నా ప్రేయసి పలువరుసల్లోని వెలుగు తోటంతా వ్యాపించింది.

ఢమ ఢమ మనే ఉరుములు అంతవరకూ ప్రశాంతంగావున్న ప్రకృతిని కలవరపెట్టగా ప్రసూనము

ళాంటి తన మృదువైన శరీరముతో నన్ను గట్టిగా హత్తుకొంది నాప్రియురాలు.

ఞ, ఞ మని అంటుం దొకచోట ఒక జంతువు.

త నువులేకమైయున్న మా స్థితిని చూసి వరుణుడూ, వాయువూ ఏకమై ఈర్ష్యచెంది వారిస్థితిని చూపించగా మే మిద్దరమూ వారి బారినుండి తప్పించుకొనేందుకు దట్టము గా నున్న ఓ పూపొదరింట్లో తలదాచుకొన్నాము.

థ ళ థళ మంటున్న నక్షత్రాలు కొన్ని కారుమేఘాలనుండి మావంక తొంగి చూస్తున్నాయి

ద క్కనే మీవంటి సుఖము మాకు అన్నట్లు గోరువంకల విరహంతో బాధపడుతూ దీనంగా మా వంక చూస్తున్నచిలుకలను అప్పుడప్పుడూ మెరుస్తున్న మెరవుల వెలుగులలో చూసామిద్దరమూ.

ధ రణిపై ప్రకాశించే గడ్డిపూలు వర్షపు నీటిలో జలకాలాడుతూ సంతోషంగా మావంక చూస్తున్నాయి.

న ల్లని మేఘాలు ఆకాశాన్ని చుంబిస్తూయుండడము నా ప్రియురాలు చూసింది.

వ మిటకొంగును నా కంఠంపైవేసి ఆ కొంగుతో నా ముఖాన్ని తనముఖానికి దగ్గరగా లాక్కొంది.

ఫ లితం! ఆమె పెదవులలోని అమృతాన్నిత్రాగి నేను అమరున్నయ్యాను.

బ లము, శక్తి నా శరీరా న్నావరించింది.

భ క్తితో భక్తులు భగవంతుణ్ణి మెప్పించినట్లు, నాశృంగారలీలతో నాప్రణయ దేవతను మెప్పించాను.

మ నోహరమైన పూలవాసనలు మా నాసికారంధ్రాలలో చేరి ఆ పూపొదరింట్లో మత్తునుకల్గిస్తుండగా పిండారబోసినట్లు వెన్నెల సృష్టినంతా ఆవరించింది.

య శస్సు, పదవి ఆర్జించాలనుకొన్న ఒక మానవుడు దూరాన. ఒక మేడమీది వరండాలో ఓ దీపపువెలుగు ముందు కూర్చొని దానికై కృషి చేస్తున్నా డా సమయాన.

ర మణీయమైన పండువెన్నెలను చూసి నా ప్రేయసి పూపొదరింటి నుండి వెలుపలికిరాగా నేనూ ఆమె ననుసరించాను.

ఱ ంపపుకోతలై, మన్మథతూపులై తన కిరణాలతో చక్రవాకులకు, చకోరులకు చందమామ బాధ సంతోషాల్ని కలుగజేస్తున్నాడు.

ల య తాళముల శ్రుతిని కలుపుతూ ఘల్లుఘల్లుమనే కాలిమువ్వల నడకలతో, గలగలమనే చేతిగాజుల ఊపులతో ఆమె వెన్నెల్లో పోతూవుంటే ఆ తోటలోని పూలకొమ్మలు, చెట్లరెమ్మలు ఆమెకు జోహారు లర్పిస్తున్నాయి.

ళ, ళ మంటూ హలో! హలో! అన్నట్టుగా గాలి తాకిడికి ఊగుతూ మమ్మల్నాహ్వానిస్తున్నాయి సరోవరములో ప్రకాశించే కలువపూలు.

వ దనములో వికాసము, కనులలో కాంతి, చూపులలో చాతుర్యము, నడకలో లావణ్యము వెలిబుచ్చే ఆమె తీరునుచూసి ఆశ్చర్యపోతున్నాయి తారలగుంపు నీలాకాశంలో.

శ రీరములో వెలుగుతున్న ఆమె సహజమైన సౌందర్యమును చూసి చిన్నబుచ్చుకొని చంద్రుడు మేఘాల మాటు దాక్కొన్నాడు.

ష ట్పదములు మకరందాపేక్ష గలిగి పూవులతావులు పసికట్టి ఆ గ్రుడ్డి వెన్నెలలో పుష్పములను చేరుకొంటుండగా నేను, నా చెలి కలువల ఆహ్వానాన్ని అంగీకరించి వాటిని చేరుకొన్నాము.

హ రియను రెండక్షరములు, హరియించును పాతకముల అన్నట్లు చెలియను రెండక్షరములు సృష్టించును స్వర్గమ్ముల అనుకొంటూ ప్రీతితో ప్రకాశించే కలువపూవులను చూసి మావలెనే చందమామతో మీ ప్రణయము రోజురోజుకూ క్రొత్త అందాలు చిందిస్తూ, అపూర్వమైన ఆనందాల్నిస్తూ సృష్ట్యాంతమువరకూ మీ ప్రణయము వర్ధిల్లాలని మేము హృదయపూర్వకముగా ఆశిస్తున్నామని అంటూండగానే నాకు మెలకువవచ్చి కండ్లునులుముకొని చూసేసరికి ప్రకృతీలేదు; నా ప్రణయ దేవతాలేదు; సూర్యుని పసిడికిరణాలు మా యింటి కిటికీలగుండా లోపల ప్రవేశిస్తున్నాయి; నా ప్రక్కనేవున్న "చిత్రగుప్త" నాకేసి దీనంగా చూస్తుంది

క్ష ణ మొకయుగంగా కాలము గడిపే వియోగులకు ఇటువంటి స్వప్నాలు రావడంలో ఆశ్చర్యములేదు. ఆ స్వప్నాలలోని మాధుర్యాన్ని పాఠకులచిత్తాల కందించి "చిత్రగుప్త" అభిమానమూ, పాఠకుల ఆదరణా అందుకోవాలనే ఆకాంక్షతో నేను క్రొత్తపంథాలో అ, ఆలు మొదలగు వాటితో ప్రారంభించి నా ఈ రచనను పూర్తిచేసాను.

★


## ఓట్టు లీలా సెంటు

ఎలప్పుడు మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసన చూచి ఆనందింతురు. ఒకసారి తీసి వాడినవారికి దీని గుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నెం. 1376 మదరాసు-1.